నాపేరు సివంచెలమండీ, తమురు ఇజానారంనించే గదండి, ఒస్త్రను? తముర్ని ఇంత గుంటడప్పుడు కాణ్ణించి ఎరుగుదునండి, నాను, నన్నే పొల్తి పట్నేదా?" అని "అట్టవాడు" దడదడలాడించే సరికి బాలకృష్ణ "ఊఁ ఊఁ, పద, పద" అని నన్ను ముందుకి తోసేడు.

కల్చరల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాం కింద బాలకృష్ణకి రష్యా వెళ్లే ఛాన్సు తగిలింది. "నీకు ఎన్నో భాషలు వచ్చుగాని, రష్యన్ భాషరాదు కదా; ఎలా అవస్తపడతావో?" అన్నాను. "నేనెందుకు అవస్తపడతానూ? అవస్తలేవో వాళ్లేపడతారు. ఆకలేస్తే కడుపు మీద అరచేత్తో కొట్టుకుంటాను. దాహం వేస్తే నోరు తెరిచి బొటకనవేలు ఆడిస్తాను. డబ్బు కావాలంటే చూపుడువేలు మీద బొటకనవేల్తో చిటితాళం వేస్తాను" అని ఏం అవసరాలకి ఏయే సంజ్ఞలో సాంగికంగా చెప్పేడు.

అయినా సరే; రష్యావాళ్లు, పాపం, ఈబాలకృష్ణతో ఏం అవస్తలు పడుతున్నారో అని నాకు బెంగగానే ఉంది. ★

# 115. ప్రకటనా ప్రియుడు

ఎవరు రాసేరో గుర్తులేదు కాని, నాలాంటి వాళ్లకు చెంపపెట్టు లాంటి వాక్యం అది.

"ఎంత గొప్పవాడైనా కానీ; 'నా చిన్నతనంలో ఒకసారి' - అని మొదలెట్టేడంటే వాణ్ణి భరించడం మహాకష్టం"-అని; ఆ వాక్యం. "నో స్టాల్జియా ఈజ్ ఎ పిటా" అని ఇంగ్లీషులో కూడా ఎవరో అన్నారు. దాని అర్థం కూడా ఇంచుమించు ఇదే కావచ్చు. అయితే మాత్రం ఏమీ; వయసు చేత పెద్ద అయిన వాళ్లు కొందరు; వినేవాళ్లంటూ ఎవరయినా దొరికితే వాళ్ల చిన్ననాటి ముచ్చట్లు తమకంటే చిన్నవాళ్లకి చెప్పడం; అవతలి వింటున్న వాళ్లు ఎంజాయి చేస్తున్నారా లేదా అన్న సంగతి పట్టించుకోకుండా చెప్పే వాళ్లు ఎంజాయి చేసుకుపోతూ వుండడం చాలా సాధారణం.

ఎవరో వేళాకోళం చేసేరు కదా అని కూడా ఎవ్వరూ తమ చిన్నతనం నాటి ఉదంతాలు తరవాతి తరంవాళ్లకో, వినడానికి సిద్ధంగా ఉన్నవాళ్లకో చెప్పడం మానరని నాకు అనిపిస్తూ వుంటుంది. చిన్ననాటి ముచ్చట్లు చెప్పేటప్పుడు నిజమూ కల్పనా కలగలుపుగా వచ్చేసి; చెప్పేవాళ్ళ కల్పనా శక్తిని అనుసరించి ఆయా ముచ్చట్లకి కావ్య గౌరవం ఒనగూడడం కూడా వుందని కొంచెం సరదాగా, కొంచెం సీరియస్‌గా ఒప్పుకోవచ్చు.

నిడుదవోలు వేంకటరావు గారని ఒక కవిపండితుడు ఉండేవారు. వారి పుత్రులలో ఇద్దరు నాకు ఎస్సెల్సీలో క్లాసుమేట్సు. నలభై అయిదేళ్ళ కిందట, ఇంటర్మీడియెట్‌తో జగ్గారావూ, ఎస్సెల్సీతో పార్వతీశ్వరరావూ చదువు ఆపేసి ఏర్‌ఫోర్సులో చేరిపోయారు. ఆ తరవాత వాళ్లెక్కడెక్కడ ఉద్యోగాలు చేసి ఎంతెంతవాళ్లు అయ్యారో తెలియలేదు. అయితే కిందటి నెలలో నేను హైదరాబాదుకి ఒకానొక వైద్యం కోసం వెళ్లి కొన్నాళ్లు గడిపినప్పుడు మా తమ్ముడు; జగ్గారావు అనే అతని ఫోన్ నెంబరు నాకు చెప్పేడు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పి విసుగెత్తించే ఉద్దేశంతో కాక, నలభై ఐదేళ్ల తరవాత అతనెలా ఉంటాడో చూడాలన్న కుతూహలంతో నేను ఆ నెంబరు పిలిచేను. అంతే, జగ్గారావు "ఆఘమేఘాల మీద" అని చెప్పదగిన విధంగా కారుమీద, రోడ్డు మీద ప్రయాణం చేసి నేను ఉన్నచోటికి వచ్చి నన్ను వాళ్లింటికి తీసికెళ్ళేడు. నా క్లాస్మేట్ అయిన తన అన్నగారు పార్వతీశ్వరరావునే కాక;ఇంకా పెద్దన్నయ్య సుందరేశ్వరరావు గార్ని కూడా తన ఇంటికి రప్పించేడు.

మేం నలుగురం కూడా అరవై దాటిన వయసు వాళ్లమే. అయినా సరే మేం ఆ రాత్రి చెప్పుకున్న కబుర్లన్నీ ఎవరో పెద్దతరం వాళ్లు చిన్నతరం వాళ్లకి చెప్పినట్టుగానే రూపుదిద్దుకున్నాయి. మా మేష్టర్ల నిక్ నేమ్సు (వేడుక నామాలు) గురించీ, మా సహాధ్యాయుల విచిత్ర ప్రవర్తనల గురించీ ఒకరు అందిస్తే ఇంకొకరు అల్లుకుపోతూ తేదీ మారిపోయే సమయం దాటేవరకూ కబుర్లు చెప్పుకున్నాం. ఆ కబుర్లలో ఎలా గుర్తొచ్చేడో; నాకు శంకర్రావు గుర్తొచ్చి వాడుగానీ మీలో ఎవరికైనా ఎక్కడైనా తగిలేడా అని-అడిగేను.

శంకర్రావుకి "ప్రకటనా ప్రియుడు" - అని నిక్ నేమ్ పెట్టుకున్నాం - ఆ రోజుల్లో మేం. అతనికి ఎడ్వర్టయిజుమెంట్లంటే ఇష్టంగా ఉండడమే దానికి కారణం. నలుగురం కలిసి సాయంకాలం పూట "వెన్‌లక్" లైబ్రరీకో "కస్తూరిబా స్మారక" పఠన మందిరానికో వెళ్తే మేం వార్తల కోసం పేపర్లు తిరగేస్తున్నపుడు శంకర్రావు ఎడ్వర్టయిజుమెంట్లు మాత్రం శ్రద్ధగా చదివేవాడు. రాత్రిపూట నిద్దర ఆపుకోడానికి టీ తాగుదామని గంటస్థంభం దాకా నడిచి వెళ్లినప్పుడు కూడా వాల్‌పోస్టర్లు జాగ్రత్తగా చూస్తూ రేపట్నుంచి ఫలానా సినిమా వేస్తారనో, ఎల్లుండి సాయంకాలం పార్కులో ఫలానా పబ్లిక్ మీటింగు జరుగుతుందనో శంకర్రావే చెప్పేవాడు. ఒకసారి శంకర్రావు ఒక సినిమా పోస్టర్ దగ్గర ఆగి, "మూడవ వారము" అన్న పేలిక అంటిస్తున్న కుర్రాళ్లని ఆపి, "అలా బోడిగా రెండవ వారము, మూడవ వారము అంటూ రాయకపోతే కొత్తరకంగా రాయకూడదూ?" అని తగువు పెట్టుకున్నాడు. రమ్యమైన రెండవ వారము, ముచ్చటైన మూడవ వారము, నాణ్యమైన నాల్గవ వారము, అందమైన ఐదవ వారము, అరుదైన ఆరవ వారము - అలా రాయమని సలహా ఇచ్చాడు.

"ప్రపంచ ఏకైక నల్లి వినాశని"..."తిన్నది అరక్క బాధపడవద్దు, మా ఫ్రూట్ సాల్టు వాడండి!" లాంటి ఎన్నో ప్రకటనలకి ఆయా కంపెనీలకి ఉత్తరాలు రాసి సరిచేయించాడు శంకర్రావు. "ఈ సబ్బు నా ముఖ కాంతిని రెట్టింపు చేస్తుంది" అనే ఒక ప్రకటన ఒకానొక నల్లతోలు సినీతార బొమ్మతో వస్తేను; "ఈ సిగరెట్టు నాకెంతో హాయినిస్తుంది" అనే ప్రకటన సిగరెట్ కాల్చే అలవాటు లేని నటుడి బొమ్మతో వస్తేను, "అబ్జక్షన్ యువరానర్!" అంటూ ఆ కంపెనీలకి ఉత్తరాలు రాసేడు.

"శంకర్రావుకి అడ్వర్టయిజుమెంటు డిజైనింగులో ఎన్నో ప్రెయిజులొచ్చేయి" అని జగ్గారావు వివరించేడు. కొత్తగా వ్యాపారంలోకి దిగుతున్న సంస్థలు కొత్తరకం సరకులు ఉత్పత్తి చేసే పాత సంస్థలు - మోడల్ ప్రకటనలు, స్లోగన్లు లాంటివి కోరుతూ ప్రకటనలు వేసినప్పుడల్లా మనవాడు ఏదో రాసి పంపడం, దానికి ప్రెయిజు రావడం జరుగుతుందని జగ్గారావు చెప్పేడు.

"అదంతా సరే; ఈ మధ్య శంకర్రావు నీకెక్కడైనా తగిలేడా, అది చెప్పు" అన్నాను.

"అదే చెప్తున్నాను. రెండేళ్ల కిందట తగిలేడు. బందర్లో ఉన్నాట్ట. ఏమిటి ఇలా వచ్చేవూ-అంటే చిన్న పరిశోధన కొచ్చేనన్నాడు. ఈ వయస్సులో నీకు రీసెర్చి ఎందుకూ అంటే పరిశోధన అనగా రీసెర్చి కాదు. ఇన్వెస్టిగేషన్ - అన్నాడు. జేబులోంచి ఒక ఎడ్వర్టయిజుమెంటు తీసి చూపించేడు. దాంట్లో ఏమనుందో తెలుసా? అరవై లక్షల రూపాయల ఆస్తి కలిగి స్వంత వ్యాపారంలో ఉన్న 38 ఏండ్ల (ఫలానా కులం) పురుషునికి ప్రస్తుత భార్య తిరుగులేని రుగ్మతతో బాధపడుతూ ఉన్నందున ద్వితీయ వివాహం చేసుకొనుటకు 30-35 ఏండ్ల ఉద్యోగస్తురాలు (అదే కులం నుండి) కావలెను."

"ఇందులో తప్పేముంది? మొదటి పెళ్ళాం మంచం పట్టేసుంటుంది. ఇంకో పెళ్లి చేసుకోమని పర్మిషన్ ఇచ్చిందేమో?" అన్నాను.

"అరవై లక్షల ఆస్తీ స్వంత వ్యాపారం ఉన్నవాడికి ఉద్యోగస్తురాలైన భార్య ఎందుకూ-అని శంకర్రావు సందేహం. వాళ్ల అన్నయ్య కూతురికి ఈ వూళ్లో ఉద్యోగంకనక (వాళ్ళదీ ఆ కులమే కనక) ఈ సందేహం తీర్చుకుందికి వచ్చేడన్నమాట" అన్నాడు జగ్గారావు.

"యామైంది, చివరికి? సందేహం తీరిందా? కథ సుఖాంతమేనా?"

"అదే చెప్తున్నాను. శంకర్రావు పరిశోధన ఫలించింది. అసలే అతగాడు వ్యాపారపు పనుల్లో తీరుబాటులేక ఫ్యాక్టరీ, ఆఫీసూ చూసుకుని రాత్రి ఏ ఎనిమిది గంటలకో వస్తాట్ట. పగలంతా ఈ సవితులిద్దరూ కొట్టుకుంటూనో తిట్టుకుంటూనో గడపకుండా చిన్నావిడ ఏదో ఉద్యోగానికి పోతే న్యూసెన్సు ఉండదనిట- ఆ ప్రకటన వేసిన అతని ఉద్దేశం! అంతేగాని పెళ్ళాం కూడా వేణ్ణీళ్ళకి చన్నీళ్ళుగా నెలకో వెయ్యి రూపాయలు సంపాదించాలని కాదుట. అలా రూఢి చేసుకొని ఆ సంబంధం ఖాయపరిచేడు మన ప్రకటనా ప్రియుడు!" ★

# 116. స్పీక్, బ్రింగ్, డిస్కస్

వీరభద్రం గారని, మాకో ఆఫీసర్‌గారు ఉండేవారు. ఆయన సరాసరి నియామకం మీద మా డిపార్ట్‌మెంట్‌లో ఆఫీసర్‌గా చేరేరు. ఉద్యోగానికి నియామకం పొందిన నాటికే పెద్ద జీతగాడు కావడం వల్ల ప్రభుత్వం ఏర్పరచిన రూలు ప్రకారం రెండు నెలల నామమాత్రపు ట్రైనింగ్ పూర్తవగానే అతన్ని మా యూనిట్‌కి ఆఫీసర్‌గా పోస్టు చేసేరు. ట్రెయినింగులో "శాస్త్ర ప్రకారం" చెప్పవలసినవేవో చెప్పినా, యూనిట్ ఇన్‌ఛార్జిగా చేరేక తటస్థించే సమస్యలను గురించీ, వాటి పరిష్కారాలను గురించీ చెప్పరు కదా. అంచేత వీరభద్రం గారు తరచుగా నిర్ణయ సంబంధమైన చిక్కుల్లో పడేవారు.

ఒకసారి ఆయన ఒక గ్రామానికి తనిఖీకి వెళ్లి, సర్వే నెంబర్ల ప్లాను చేత్తో పుచ్చుకుని పొలాల్లో తిరుగుతూ ఉండగా ఒక తమాషా జరిగింది. ప్లాను ప్రకారం తను తిరుగుతున్న పొలం గట్లు ఫలానా అని గుర్తించడానికి తను ఎక్కడున్నాడో ఆ స్థలానికి ప్లాన్‌లో ఉన్న గీత మీద ఒక వేలు ఉంచుకుని పని కానిస్తూ ఉన్నాడన్న మాట. ఉన్నట్టుండి ఆయన ముక్కుమీద ఒక ఈగ వాలింది. మొహం ఇటూ అటూ జాడించినా ఈగ పోయింది కాదు. దాంతో ప్లాను మీద ఉన్న వేలితో ఈగను తరిమాడు. ఈగైతే పోయింది గాని ఆ ఈగని తరిమిన వేలు ప్లాన్‌లో ఎక్కణ్ణించి తీశాడో ఆయనకి గుర్తు రాలేదు. "అరె! వేలు తీసేశానే; ఎక్కడున్నాం మనం?" అని తనలో అనుకోవలసింది కాస్తా పైకి అనేశాడు. సర్వే అధికారికి అది చాలా అవమానకరమైన విషయం.

అయితే ఆయన అప్పట్నుంచి మరోరకం జాగ్రత్త పాటించి; తనకి ఏదో తెలియడం లేదన్న సంగతి ఇతరులకి తెలియకుండా జాగ్రత్త పడే టెక్నిక్ నేర్చాడు. "ఏమయ్యా, రంగనాయకులూ! గవర్నమెంట్ బంజరు భూముల్లో రాజకీయ బాధితులకి - లేదా యుద్ధ కారణంగా వికలాంగులైన వారికి - పట్టాలిమ్మని రికమెండ్ చేసేటప్పుడు పాటించవలసిన నియమ నిబంధనలు నీకు సరిగ్గా తెలుసా అసలు?" అని డబాయించి; ఎదురుగుండా ఉన్న ఫైల్‌ని ఎత్తికొట్టేవాడు. దాంతో ఆ రంగనాయకులు తను రూల్సన్నీ ఎలా తూచా తప్పకుండా పాటించేడో ఆ వివరం అంతా మనవి